# ఆర్మూర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేశా

- మరోసారి ఆశీర్వదించండి
- కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే గోసపడతాం..
- ప్రజా ఆశీర్వాద యాత్రలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



ప్రజా ఆశీర్వాద యాత్రకు హాజరైన గ్రామస్తులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్, అక్టోబర్ 25 : ఆర్మూర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేశానని.. మళ్లీ తనను ఆశీర్వదించి, భారీ మెజారిటీతో గెలిపించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి కోరారు. 'నమస్తే నవనాథపురం' కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో ప్రజా ఆశీర్వాద యాత్రను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోకి చేరుకున్న జీవన్‌రెడ్డికి మహిళలు, యువకులు ఘన స్వాగతం పలికారు. మహిళలు బతుకమ్మలు, బోనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వారి మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ 60 ఏండ్ల పాలనలో పల్లెల్లో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. బీఆర్ఎస్ పాలన రాష్ట్రానికి స్వర్ణయుగమన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, రాష్ట్రంలో ఎటు చూసినా అభివృద్ధి, సంక్షేమమే కనిపిస్తున్నదన్నారు. కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వం ఎంతో అవసరమన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అసపురం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సురేశ్, పిప్రి సొసైటీ చైర్మన్ సోమ హేమంత్‌రెడ్డి, ఆర్మూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఇట్టెడి లింగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్మూర్‌లో సీఎం సభా ఏర్పాట్ల పరిశీలన



సీఎం సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్, అక్టోబర్ 25; ఎన్నికల ప్రచారంలో భాగంగా నవంబర్ 3న ఆర్మూర్‌లో నిర్వహించ తలపెట్టిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ ఆశన్నగారి జీవన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఆర్మూర్ పట్టణంలోని ఆలూర్ బైపాస్ రోడ్డులో బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభాస్థలిలో గుంతల్లో మొరం పోసి చదును చేశారు. పార్కింగ్ ప్రదేశాలను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినితా పవన్, ఆర్మూర్ ఎంపీపీ పస్క నర్సయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఈ గంగాధర్, జక్కం పోశెట్టి, జన్నపల్లి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా అలయ్‌బలయ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిక్క లింబాద్రి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 25 : దసరా పండుగను పురస్కరించుకొని వివిధ వర్గాల వారితో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా సాగింది. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుకులపరుగుల జీవితంలో అలయ్ బలయ్ వంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆత్మీయ సమ్మేళనాలు భావితరాలకు పండుగ విశిష్టత, సంస్కృతీసంప్రదాయాలు తెలుసుకునేందుకు దోహదపడుతాయని అన్నారు. ఈ సందర్భంగా కందకుర్తి యాదవ్‌రావుకు జీవనసాఫల్య పురస్కారం, పంచరెడ్డి లక్ష్మణ్, వేదాంతం రంగనాథ్, రాకేశ్ వైద్య, చింతల గంగాదాస్, చెన్న శంకర్‌లకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. డిచ్‌పల్లి 7వ పటాలం కమాండెంట్ రాంప్రసాద్, నగర మేయర్ దండు నీతూ కిరణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆరుట్ల రాజేశ్వర్ విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో వి.పి చందన్‌రావు, పొద్దుటూరి మాధవీలత, డాక్టర్ త్రివేణి, డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు. ఇందూరు యజ్ఞ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మూఢనాగభూషణం గుప్తాను ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు.

# గులాబీకి అండగా

- కుల సంఘాల ఆత్మీయ ఆహ్వానం
- రూరల్‌లో దూసుకుపోతున్న బీఆర్ఎస్
- పటిష్టమైన క్యాడర్‌తో ప్రచారంలో ముందుకు సాగుతున్న బాజిరెడ్డి
- బీఆర్ఎస్ అభ్యర్థికి అండగా కులసంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాలు
- నేడు బోర్గాం(పీ)లో రెడ్డి కులస్తుల ఆత్మీయ సమ్మేళనం



రెడ్డికుల సంఘాల నాయకులతో మాట్లాడుతున్న బాజిరెడ్డి జగన్

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 25: జిల్లాలోనే అతి పెద్ద నియోజకవర్గంగా పేరొందిన నిజామాబాద్ రూరల్‌లో గత ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా త్రిముఖ పోటీ కొనసాగనున్నది. బీఆర్ఎస్ తరపున రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన బాజిరెడ్డి గోవర్ధన్.. పార్టీ ఆదేశాల మేరకు మూడోసారి కూడా బరిలో ఉన్నారు. ఈ నెల 15న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బాజిరెడ్డి బీఫారం కూడా అందుకున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ ఖరారు చేస్తామని పార్టీ అధినేత సీఎం కేసీఆర్ మూడు నెలల ముందుగానే ప్రకటించడంతో బాజిరెడ్డి అందుకనుగుణంగా అన్ని మండలాల్లోనూ పార్టీ క్యాడర్‌ను పటిష్టం చేసి, ప్రచారంలో ముందుకెళ్లాలని నిర్ణయించారు. విపక్ష పార్టీల నాయకులు చేసే అబద్ధపు ప్రచారం, పన్నే కుట్రలు, కుతంత్రాలను ఎప్పటికప్పుడు ఎండగట్టేందుకు క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్‌ని పటిష్టం చేయాలనే ఉద్దేశంతో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆదేశాలతో ప్రతి గ్రామంలో పార్టీ కమిటీ, వంద ఓటర్లకు ఒక సభ్యుడిని నియమించే ప్రక్రియను ఏడాది క్రితమే పూర్తిచేశారు. నియోజకవర్గంలోని మండలాల వారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం కూడా విజయవంతంగా నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలు పార్టీ నాయకులు, కార్యకర్తల్లో చైతన్య స్ఫూర్తిని నింపాయి. ఈ నియోజకవర్గంలో పదేండ్లుగా బీఆర్ఎస్ హవాయే కొనసాగుతున్నది. బాజిరెడ్డి తనయుడు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ తండ్రికి బాసటగా నిలుస్తూ నియోజకవర్గంలోని మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. వారం రోజుల క్రితం బాజిరెడ్డి జగన్, నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, రూరల్, మోపాల్ మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి ఎన్నికల ప్రచారం సందర్భంగా అనుసరించాల్సిన పద్ధతులు, జాగ్రత్తలను వివరించారు. గ్రామస్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించడానికి సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన అంశాలపై ఇంటింటా విస్తృతంగా ప్రచారం చేయాల్సిన ఆవశ్యకతను కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులకు వివరించారు. ఇదిలా ఉండగా అసెంబ్లీ ఎన్నికలకు మరో 35 రోజుల సమయం మాత్రమే ఉన్నందున ఇప్పటికీ కూడా కాంగ్రెస్, బీజేపీ తరపున పోటీ చేసే అభ్యర్థులను ఇంతవరకు ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో అత్యధిక బలగం ఉన్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు వ్యూహాత్మకంగా ప్రచారం చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు.

**బాజిరెడ్డికిమద్దతుగా నేటి నుంచి ఆత్మీయ సమ్మేళనాలు..**

గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బరిలో నిలిచిన బాజిరెడ్డికి మద్దతుగా అన్ని కులసంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసారి కూడా అదే తరహాలో కులసంఘాల నాయకులు ముందుకొచ్చి తాము నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాలని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌లకు ఆహ్వానించే ప్రక్రియ కొనసాగుతున్నది. ఏడు మండలాల్లో ఉన్న నియోజకవర్గ స్థాయి కులసంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. తొలుత నియోజకవర్గంలోని రెడ్డి కులస్తుల ఆత్మీయ సమ్మేళనం గురువారం మోపాల్ మండలంలోని బోర్గాం(పీ) గ్రామంలోని మొటాడి రెడ్డి కల్యాణ మండపంలో నిర్వహించేందుకు ఆ కుల సంఘం నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. డిచ్‌పల్లి మండలంలోని నడ్పల్లి గ్రామశివారులో ఉన్న జీ కన్వెన్షన్ హాల్‌లో 27న గొల్ల కుర్మ, యాదవ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం, 28న దళిత కులస్తుల ఆత్మీయ సమ్మేళనం, 29న డిచ్‌పల్లిలోని ఎస్‌ఎల్‌జీ గార్డెన్‌లో పద్మశాలీ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం, 30న బోర్గాం(పి) శివారులోని భారతి గార్డెన్‌లో గంగపుత్ర కుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. మరికొన్ని కులసంఘాలు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటించనున్నాయి. ఇప్పటికే ప్రకటించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఆయా కులసంఘాల నాయకులు సమష్టి కృషి చేస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి 3వేల నుంచి 4 వేల మంది తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I JAMMAGOUNIPYAATLA LAVANYA W/O JAMMAGOUNIPYAATLA PARASHURAMA GOUD (OLD NAME) R/O H NO 9-44 BIKNOOR (V&M) KAMAREDDY DIST TS I HAVE CHANGED TO BANDARI LAVANYA (NEW NAME) W/O JAMMAGOUNIPYAATLA PARASHURAMA GOUD FOR ALL FUTURE PURPOSES.
NTZ-318512

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.